


# విడువుము – విడువకుము

*యేసయ్య ప్రియమైన నామమునకు మహిమ కలుగును గాక!*

మూలవాక్యము :- యోహాను సువార్త 4:28 ఆ స్త్రీ తన కుండ విడిచిపెట్టి ఊరిలోనికి వెళ్లి

యేసుక్రీస్తు ప్రభువుల వారు ఈ భూమి మీద శరీరధారిగా ఉన్న దినములలో సువార్త ప్రకటింస్తూ అనేక గ్రామాలు, పట్టణాలు, ప్రాంతాలు సంచరించినట్లుగా పరిశుద్ధ గ్రంధంలో మనము చూడగలము. అలా సువార్త ప్రకటిస్తున్న దినాలలో ఒక దినము అయన సమరయ ప్రాంతమైన సుఖారను(సుఖారు అనగా అబద్దము లేక తాగుబోతు అని అర్థం. ఈ సుఖారు అనే పదం షెకెము నుండి వచ్చినట్లుగా భావిస్తున్నారు. ఇది దక్షిణ ఏబాలు ప్రాంతంలోని అక్సర్ అనే సమరయ ప్రాంతం. దీనికి ఉత్తరంగా 1మైలు దూరంలో యాకోబు బావి ఉంది.) గ్రామ శివారులోని యాకోబు బావి యొద్ద అలసిపోయి కూర్చున్నారు. అప్పుడు మధ్యాహ్నము సమయము పండ్రెండు గంటల వేళ, ఆహారము కొని తెమ్మని శిష్యులను గ్రామములోనికి పంపించారు. ఆయన ఒంటరిగా ఆ బావి యొద్ద కూర్చున్నప్పుడు ఒక సమరయ స్త్రీ ఆ ఎండవేళ నీళ్ళు చేదుకొనుటకు ఒక కుండను తీసుకొని వచ్చింది. దాహముతో ఉన్న యేసయ్య ఆమెను త్రాగుటకు నీళ్లు ఇమ్మని అడిగారు. అయితే ఆమె నీవు యూదుడవు నేను సమరయురాలిని త్రాగుటకు నీళ్లు ఇమ్మని నన్నేల అడుగుచున్నావు అని చెప్పింది. ఎందుకంటే యూదులు సమరయులతో సాంగత్యము చేయరు.

ఇక్కడ ఒక ఆత్మీయ సత్యం ఉంది మొదటిసారి యేసయ్య మనతో మాట్లాడితే , లేదా వేరొక దైవసేవకుని ద్వారా ఆయన సువార్తను మనకు తెలియ పరిస్తే యేసయ్య మనకు పరాయి మతానికి చెందిన దేవుడుగా కనిపిస్తారు.

ఆ తర్వాత వారి సంభాషణ కొనసాగింది. యేసయ్య నేనేవరో నీకు తెలిస్తే నీవు నన్ను దాహమునకు నీళ్ళు అడిగెదవు. నేను నీకు జీవజలములు ఇచ్చెదను అని చెప్పారు. అప్పుడు ఆ స్త్రీ యేసయ్యతో ఈ బావి నీళ్ళు - తాను, తన కుమారులు, పశువులు త్రాగి మాక్చిన మన తండ్రియైన యాకోబు కంటే నీవు గొప్పవాడివా? అని ప్రశ్నించింది. ఆ స్త్రీ చెప్పిన మాటను జాగ్రత్తగా గమనించాలి. మన తండ్రియైన యాకోబు అంటుంది. ఆ మాటకు అర్థం నీ తండ్రి , నా తండ్రి ఒక్కరే అంటే నీవు నేను సహోదరి, సహోదరులము.

అవును ప్రియులారా యేసయ్యతో సహవాసం పెరిగితే మొదట పరాయి మత దేవునిగా కనిపించిన యేసయ్యకు నీకు కలిగిన ఉన్న అసలైన, నిజమైన బంధం తెలుస్తుంది. నేనిచ్చు నీళ్ళు త్రాగువాడు ఎప్పుడు దప్పిగొనడు అని యేసయ్య ఆ స్త్రీతో చెప్పినప్పుడు నేను ఈ ఎండవేళ కష్టపడి ఇక్కడికి ప్రతి దినము త్రాగు నీళ్ళకు రాకుండునట్లు ఆనీళ్లను నాకిమ్మని ఆయనను అడిగింది. అప్పుడు యేసయ్య నీ భర్తను పిలుచుకొని వస్తే ఆనీళ్లు నీకిస్తానన్నాడు. ఆ స్త్రీ నాకు భర్త లేడు అని యేసయ్యకు జవాబిస్తుంది. సర్వము ఎరిగిన యేసయ్య నీకు భర్త లేడనినీవు చెప్పిన మాట నిజమే నీకు 5 గురు భర్తలుండిరి. ఇప్పుడున్నవాడు భర్త కాడు నిజమే చెప్పితివి అని ఆ స్త్రీ గత జీవితాన్ని గుర్తు చేశారు. అప్పుడా స్త్రీ, అయ్యా నీవు ప్రవక్తవని గ్రహించుచున్నాను అని యేసయ్యతో చెప్పింది




అవును ప్రియులారా, యేసయ్య మనతో మాట్లాడుతూ ఉంటే, మనం యేసయ్యతో మాట్లాడుతూ ఉంటే ఆయన సాధారణమైన వ్యక్తి కాదు అని గుర్తించగలుగుతాం. అలా వారి సంభాషణ కొనసాగుతుండగా యేసయ్య ఆమెకు ఈ లోకముకు రానైయున్న మెస్సీయ తానేనన్న సత్యాన్ని తెలియ జేశారు. ఆమె ఊరిలోనికి వెళ్లి నేను చేసినవన్నియు నాతో చెప్పిన వానిని వచ్చిచూడుడి ఈయన మెస్సీయ కాడా అని ఆ ఊరి వారికందరికీ సువార్త ప్రకటించింది యేసుక్రీస్తు ఆమెను సంధించినప్పుడు ఆమె దృష్టిలో యేసుక్రీస్తు మొదట

1. *యూదుడు*
2. మన తండ్రి యాకోబు అని చెప్పినప్పుడు మనము అన్నాచెల్లెల్లము లేదా అక్కాదమ్ముల్లము.
3. నీవు ప్రవక్తవు అని గుర్తించింది
4. ఈయన మెస్సీయ(లోకరక్షకుడు) అని గుర్తించి, ప్రకటించింది.

ఆమె ఊరిలోనికి వెళ్లి ప్రకటించక మునుపు ఆమె తన కుండను విడిచిపెట్టినట్లుగా వాక్యం తెలియజేస్తుంది. ఈ కుండ ఏమిటి అని మనం ఆలోచిస్తే, అది ఆమె పాత జీవితం. పాపపు జీవితం. 5 గురు భర్తల దగ్గర ఆమెకు సంతోషం, సంతృప్తి దొరకలేదు. ఆరవ వ్యక్తితో సహజీవనము చేస్తోంది. ఆమె ఎంత భయంకరమైన పాపపు బంధకాలలో ఉందో అర్ధం చేసుకోవచ్చు. ఎండవేళ బావి దగ్గరికి త్రాగునీటి కొరకు వచ్చిందంటే, బహుశా ఆ గ్రామానికి చెందినవారు ఎవ్వరూ అక్కడికి రాని సమయము అని అర్థమౌతుంది. తన ముఖము ఇతరులకు చూపించుటకు కుడా అవకాశము లేనంతగా శరీరానుసారమైన జీవితము జీవిస్తున్నది. అయితే యేసయ్య ఆమెను సంధించినప్పుడు, ఆమెతో మాట్లాడినప్పుడు ఆ కొద్ది సమయంలోనే ఆమె పాత జీవితం విడిచిపెట్టింది.

ఈ ఉపవాస దినాలలో యేసయ్యతో 40 దినాలు సహవాసం చేస్తే ఆయనలోని గొప్పదనాన్ని మనం గుర్తించగలుగుతాం. ఆయన మనతో మాట్లాడి మన బలహీనతలు, మనలోని పాపములు, రహస్యమందు చేసిన తప్పిదములు తెలియజేస్తారు. ఆ స్త్రీ కుండ విడిచి పెట్టినట్లుగా మనం కుడా మన పాపములు, అంతరంగ బలహీనతలు విడిచిపెట్టుటకు ఈ ఉపవాసదినాలు ఎంతగానో ప్రయోజనకరమౌతాయి.

మనము ఏమి విడిచి పెట్టుకోవలెనో , ఏమి విడిచిపెట్టుకోకుండా గట్టిగా పట్టుకొని వుండవలెనో వాక్యములో గమనిద్దాం...

*మనము ఏమేమి విడిచిపెట్టాలి :-*

1. *పాపము విడిచిపెట్టాలి :* **యోబు గ్రంథము11:14** పాపము నీ చేతిలోనుండుట చూచి నీవు దానివిడిచినయెడలనీ గుడారములలోనుండి దుర్మార్గతను నీవు కొట్టివేసిన యెడల

   **హెబ్రీయులకు12:2** మనముకూడ ప్రతిభారమును, సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి, విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తనయెదుట ఉంచబడిన ఆనందముకొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనముయొక్క కుడి పార్శ్వమున ఆసీనుడైయున్నాడు.

2. *కీడు చేయుట విడిచిపెట్టాలి:* **ఆమోసు5: 14** మీరు బ్రదుకునట్లు కీడు విడిచి మేలు వెదకుడి; ఆలాగు చేసినయెడల మీరనుకొను చొప్పున దేవుడును సైన్యములకధిపతియునగు యెహోవా మీకు తోడుగానుండును.




3. *చెడుతనము విడిచిపెట్టాలి :* **సామెతలు 3:7** నేను జ్ఞానిని గదా అని నీవనుకొనవద్దు యెహోవాయందు భయభక్తులు గలిగి చెడుతనము విడిచి పెట్టుము

4. *అక్రమములు విడిచిపెట్టాలి:* **యెహెజ్కేలు18:30** కాబట్టి ఇశ్రాయేలీయులారా, యెవని ప్రవర్తననుబట్టి వానికి శిక్ష విధింతును. మనస్సు త్రిప్పుకొని మీ అక్రమములు మీకు శిక్షాకారణములు కాకుండునట్లు వాటినన్నిటిని విడిచిపెట్టుడి.

5. *అతిక్రమములు విడిచిపెట్టాలి:* **సామెతలు28:13** అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును.

**యెషయా 1:28** అతిక్రమము చేయువారును పాపులును నిశ్శేషముగా నాశనమగుదురు యెహోవాను విసర్జించువారు లయమగుదురు.

**క్రమము:-** **దేవుడు చేయమని చెప్పింది క్రమము**

**అక్రమము:-** **దేవుడు చెప్పనిది చేయడము అక్రమము**

**అతిక్రమము:-** **దేవుడు చెప్పిన దానికంటే ఎక్కువ చేయడము(over action) అతిక్రమము**

6. *హేయకృత్యములు విడిచిపెట్టాలి :* **యెహెజ్కేలు 20 :7** అప్పుడునేను మీ దేవుడనైన యెహోవాను, మీలో ప్రతివాడు తన కిష్టమైన హేయకృత్యములను విడిచిపెట్టవలెను, ఐగుప్తీయుల విగ్రహములను పూజించుటచేత మిమ్మును మీరు అపవిత్రపరచు కొనకుండవలెను అని నేను ఆజ్ఞాపించితిని.

**ద్వితీయోపదేశకాండము23:17,18** ఇశ్రాయేలు కుమార్తెలలో ఎవతెయు వేశ్యగా ఉండ కూడదు. ఇశ్రాయేలు కుమారులలో ఎవడును పురుషగామిగా ఉండకూడదు. పడుపుసొమ్మునే గాని కుక్క విలువనే గాని మ్రొక్కుబడిగా నీ దేవుడైన యెహోవా యింటికి తేకూడదు. ఏలయనగా ఆ రెండును నీ దేవుడైన యెహోవాకు హేయములు.

**ద్వితీయోపదేశకాండము25:13-16** హెచ్చుతగ్గులుగల వేరువేరు తూనికె రాళ్లు నీ సంచిలో నుంచుకొనకూడదు. హెచ్చుతగ్గులుగల వేరు వేరు తూములు నీ యింట ఉంచుకొనకూడదు. నీ దేవు డైన యెహోవా నీకిచ్చుచున్న దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు తక్కువవికాని న్యాయమైన తూనికె రాళ్లు నీవు ఉంచుకొనవలెను. తక్కువదికాని న్యాయమైన తూము నీకు ఉండవలెను. ఆలాగు చేయని ప్రతివాడును, అనగా అన్యాయము చేయు ప్రతివాడును నీ దేవుడైన యెహోవాకు హేయుడు.

**సామెతలు6:16-19** యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు ఏడును ఆయనకు హేయములు . అవేవనగా, అహంకార దృష్టియు కల్లలాడు నాలుకయు నిరపరాధులను చంపు చేతులును . దుర్యోచనలు యోచించు హృదయమును కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును

7. *దుర్మార్గము విడిచిపెట్టాలి :* **యోనా3:9** మనుష్యు లందరు తమ దుర్మార్గములను విడిచి తాము చేయు బలాత్కారమును మానివేయవలెను, మనుష్యులేమి పశువులేమి సమస్తమును గోనెపట్ట కట్టుకొనవలెను జనులు మనఃపూర్వకముగా దేవుని వేడుకొనవలెను అని దూతలు నీనెవె పట్టణములో చాటించి ప్రకటన చేసిరి.

**యిర్మీయా35:15** మరియు పెందల కడ లేచి ప్రవక్తలైన నా సేవకులనందరిని మీయొద్దకు పంపుచు ప్రతివాడును తన దుర్మార్గతను విడిచి మీ క్రియలను చక్కపరచుకొనినయెడలను, అన్యదేవతలను అనుసరింపకయు వాటిని పూజింపకయు నుండినయెడలను, నేను మీకును మీ పితరులకును ఇచ్చిన దేశములో మీరు నివసింతురని నేను ప్రకటించితిని గాని మీరు చెవియొగ్గక నా మాట వినకపోతిరి




**యిర్మీయా36:3** నేను యూదా వారికి చేయనుద్దేశించు కీడంతటినిగూర్చి వారు విని నేను వారి దోషమును వారి పాపమును క్షమించునట్లు తమ దుర్మార్గతను విడిచి పశ్చాత్తాపపడుదురేమో.

**యెహెజ్కేలు33:8,9** దుర్మార్గుడా, నీవు నిశ్చయముగా మర ణము నొందుదువు అని దుర్మార్గునికి నేను సెలవియ్యగా, అతడు తన దుర్మార్గతను విడిచి జాగ్రత్తపడునట్లు నీవు ఆ దుర్మార్గునికి నా మాట తెలియజేయని యెడల ఆ దుర్మా ర్గుడు తన దోషమునుబట్టి మరణము నొందును గాని అతని ప్రాణమునుగూర్చి నిన్ను విచారణచేయుదును. అయితే ఆ దుర్మార్గుడు తన దుర్మార్గతను విడువవలెనని నీవు అతనిని హెచ్చరిక చేయగా అతడు తన దుర్మార్గతను విడువనియెడల అతడు తన దోషమునుబట్టి మరణము నొందును గాని నీవు నీ ప్రాణము దక్కించుకొందువు.

**1సమూయేలు2: 12,15,22** ఏలీ కుమారులు యెహోవాను ఎరుగనివారై మిక్కిలి దుర్మార్గులైయుండిరి. ఇదియు గాక వారు క్రొవ్వును దహింపకమునుపు యాజ కుని పనివాడు వచ్చి బలిపశువును వధించువానితో యాజకునికి వండించుటకై మాంసమిమ్ము, ఉడకబెట్టిన మాంసము అతడు నీయొద్ద తీసికొనడు, పచ్చి మాంసమే కావలెను అని చెప్పుచువచ్చెను. ఏలీ బహు వృద్ధుడాయెను. ఇశ్రాయేలీయులకు తన కుమారులు చేసిన కార్యములన్నియు, వారు ప్రత్యక్షపు గుడారముయొక్క ద్వారము దగ్గరకు సేవ చేయుటకువచ్చిన స్త్రీలతో శయనించుటయను మాట చెవిని పడగా వారిని పిలిచి యిట్లనెను

8. *వివాదము విడిచిపెట్టాలి :* **సామెతలు17:14** కలహారంభము నీటిగట్టున పుట్టు ఊట వివాదము అధికము కాకమునుపే దాని విడిచిపెట్టుము. దుష్టులు నిర్దోషులని తీర్పు తీర్చువాడు

**తీతుకు3:9** అవివేకతర్కములును వంశావళులును కలహములును ధర్మశాస్త్రమునుగూర్చిన వివాదములును నిష్ప్రయోజనమును వ్యర్థమునై యున్నవి గనుక వాటికి దూరముగా ఉండుము.

**అపొస్తలుల కార్యములు15:39** వారిలో తీవ్రమైన వాదము కలిగినందున వారు ఒకనిని ఒకడు విడిచి వేరైపోయిరి. బర్నబా మార్కును వెంటబెట్టుకొని ఓడ ఎక్కి కుప్రకు వెళ్లెను

9. *ఆగ్రహము విడిచిపెట్టాలి:* **కీర్తనల37:8** కోపము మానుము ఆగ్రహము విడిచిపెట్టుము వ్యసనపడకుము అది కీడుకే కారణము

10. *నిద్రయందు ఆసక్తి విడిచిపెట్టాలి:* **సామెతలు20:13** లేమికి భయపడి నిద్రయందు ఆసక్తి విడువుము నీవు మేల్కొనియుండిన యెడల ఆహారము తిని తృప్తి పొందుదువు.

11. *ధనాపేక్షను విడిచిపెట్టాలి:* **1తిమోతికి6:9-11** ధనవంతులగుటకు అపేక్షించు వారు శోధనలోను ఉరిలోను, అవివేక యుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్షసమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి. దైవజనుడా, నీవైతే వీటివి విసర్జించి, నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాదించుకొనుటకు ప్రయాసపడుము.




12. *విగ్రహములు విడిచిపెట్టాలి:* **యెహెజ్కేలు14:1-6** అంతట ఇశ్రాయేలీయుల పెద్దలలో కొందరు నా యొద్దకు వచ్చి నా యెదుట కూర్చుండియుండగా. యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను. నరపుత్రుడా, యీ మనుష్యులు తమ హృదయములలో విగ్రహములనే నిలుపుకొని దోషము పుట్టించు అభ్యంతరమును తమయెదుటనే పెట్టుకొని యున్నారు, వీరు నాయొద్ద ఏమైన విచారణచేయదగునా?

కావున నీవు వారికి సంగతి తెలియజేసి యీలాగు చెప్పుముప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా తమ విస్తార మైన విగ్రహములనుబట్టి తమ మనస్సున విగ్రహములను నిలుపుకొని తమకు దోషము కలుగజేసికొని తమ యెదుట అభ్యంతరమును పెట్టుకొని ప్రవక్తయొద్దకు వచ్చు ఇశ్రాయేలీయులందరు. తమ విగ్రహముల మూలముగా నాకు అన్యులైరి గనుక నేను వారి హృదయమును లోపరచునట్లు యెహోవానగు నేనే వారికి ప్రత్యుత్తరమిచ్చు చున్నాను.

కాబట్టి ఇశ్రాయేలీయులకు నీవు ఈ మాట చెప్పుముప్రభువగు యెహోవా సెలవిచ్చునదేమనగా మీ విగ్రహములను విడిచిపెట్టి మీరు చేయు హేయకృత్యములన్నిటిని మాని మనస్సు త్రిప్పుకొనుడి

**1 థెస్సలొనీకయులకు1:9,10** మీయొద్ద మాకెట్టి ప్రవేశము కలిగెనో, అక్కడి జనులు మమ్మునుగూర్చి తెలియ జెప్పుచున్నారు. మరియు మీరు విగ్రహములను విడిచిపెట్టి, జీవముగలవాడును సత్యవంతుడునగు దేవునికి దాసు లగుటకును,..దేవుడు మృతులలోనుండి లేపిన యేసు, అనగా రాబోవు ఉగ్రతనుండి మనలను తప్పించుచున్న ఆయన కుమారుడైన యేసు, పరలోకమునుండి వచ్చునని యెదురు చూచుటకును, మీరేలాగు దేవుని వైపునకు తిరిగితిరో ఆ సంగతి వారే తెలియజేయుచున్నారు.

13. *నిర్జీవక్రియలు విడిచిపెట్టాలి:* **హెబ్రీయులకు6:1** కాబట్టి నిర్జీవక్రియలను విడిచి, మారుమనస్సు పొందుటయు,

**హెబ్రీయులకు9:14** నిత్యుడగు ఆత్మద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించు కొనిన క్రీస్తుయొక్క రక్తము, నిర్జీవక్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధిచేయును.

14. *యౌవనేచ్చలు విడిచిపెట్టాలి :* **2తిమోతి2:22** నీవు యౌవనేచ్ఛల నుండి పారిపొమ్ము, పవిత్ర హృదయులై ప్రభువునకు ప్రార్థన చేయువారితోకూడ నీతిని విశ్వాసమును ప్రేమను సమాధానమును వెంటాడుము.

**మార్కు10:28** పేతురు ఇదిగోమేము సమస్తమును విడిచిపెట్టి నిన్ను వెంబడించితిమని ఆయనతో చెప్పసాగెను.

***మనము విడువకూడనివి:-***

1. *దయ, సత్యము విడిచి పోనియ్యకూడదు:* **సామెతలు3:3** దయను సత్యమును ఎన్నడును నిన్ను విడిచి పోనియ్యకుము వాటిని కంఠభూషణముగా ధరించుకొనుము. నీ హృదయమను పలకమీద వాటిని వ్రాసికొనుము.
2. *జ్ఞానము విడువకూడదు:* **సామెతలు4:6** జ్ఞానమును విడువక యుండినయెడల అది నిన్ను కాపాడును దాని ప్రేమించినయెడల అది నిన్ను రక్షించును.
3. *ఉపదేశము విడువకూడదు:* **సామెతలు4:13** ఉపదేశమును విడిచిపెట్టక దాని గట్టిగా పట్టు కొనుము అది నీకు జీవము గనుక దాని పొందియుండుము
4. *న్యాయము, దేవుని ప్రేమ విడువకూడదు:* **లూకా 11:42** అయ్యో పరిసయ్యులారా, మీరు పుదీనా సదాపా మొదలైన ప్రతి కూరలోను పదియవవంతు చెల్లించు చున్నారే గాని,న్యాయమును దేవుని ప్రేమను విడిచి పెట్టుచున్నారు. వాటిని మానక వీటినిచే,

5. *ధైర్యము విడువకూడదు:* **హెబ్రీయులకు10:35** కాబట్టి మీ ధైర్యమును విడిచిపెట్టకుడి; దానికి ప్రతిఫలముగా గొప్ప బహుమానము కలుగును.

6. *న్యాయవిధులు విడువకూడదు :* **యెషయా58:2** తమ దేవుని న్యాయవిధిని విడువక నీతిని అనుసరించువారైనట్టు అనుదినము వారు నాయొద్ద విచారణ చేయుచు నా మార్గములను తెలిసికొన నిచ్ఛ కనుపరచుదురు తమకు న్యాయమైన తీర్పులు తీర్చవలెనని వారడుగుదురు. దేవుడు తమకు ప్రత్యక్షుడు కావలెనని యిచ్ఛ యింతురు.

7. *క్రీస్తు బోధ విడువకూడదు :* **2 యోహాను1:9** క్రీస్తుబోధ యందు నిలిచియుండక దానిని విడిచి ముందునకుసాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించు వాడు.

8. *స్థిరమనస్సు విడువకూడదు:* **2 పేతురు3:17** ప్రియులారా, మీరు ఈ సంగతులు ముందుగా తెలిసికొనియున్నారు గనుక మీరు నీతివిరోధుల తప్పుబోధవలన తొలగింపబడి, మీకు కలిగిన స్థిరమనస్సును విడిచి పడిపోకుండ కాచుకొనియుండుడి.

9. దేవాలయమును విడువకూడదు: **లూకా సువార్త2:37** యెనుబది నాలుగు సంవత్సరములు విధవరాలైయుండి, దేవాలయము విడువక ఉపవాస ప్రార్థనలతో రేయింబగళ్లు సేవచేయుచుండెను.

10. *దేవునిని విడువకూడదు:* **యెషయా 1:4** పాపిష్ఠి జనమా, దోషభరితమైన ప్రజలారా, దుష్టసంతానమా, చెరుపుచేయు పిల్లలారా, మీకుశ్రమ. వారు యెహోవాను విసర్జించి యున్నారు ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధదేవుని దూషింతురు ఆయనను విడిచి తొలగిపోయి యున్నారు.

***హెచ్చరిక:-*** **మత్తయి25:41** అప్పుడాయన యెడమవైపున ఉండువారిని చూచి శపింపబడినవారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి.

**యేసయ్య నన్ను విడిచి వెళ్లమనడం మనకు ఎంత అపాయకరమో ఆలోచించండి. మనం అలవాట్లు వదలక పోతే యేసయ్య మనలను విడిచివెళతారు.**

***ప్రియమైన సహోదరుడా, సహోదరి మన జీవితంలో ఏమి విడిచిపెట్టాలో, ఏమి విడిచిపెట్టకూడదో వాక్యం మనకు తెలియజేసింది. విడువుమని చెప్పినవి విడిచిపెట్టకపోతే , ఒక దినం రాబోతోంది. అది తీర్పు దినం . అప్పుడు యేసయ్య నిన్ను , నన్ను చూచి నన్ను విడిచి నరకము లోనికి వెళ్లిపోమంటారు. అది ఎంత భయంకరమో ఆలోచించు. కాబట్టి వాక్యము హెచ్చరించినట్టు మనలోని దేవునికి అయిష్టమైన వాటిని విడిచిపెట్టుకుందాం. బలహీనతలు విడిచిపెట్టడానికి మందిరము శ్రేష్టమైన చోటు. అలాగే ఉపవాస ప్రార్థనలు మంచి వాతావరణం. Lentలో ప్రార్థన జీవితం మనకు సమృద్ధిగా ఉంటుంది. మందిరములో మనలను చెడు అలవాట్లు కోసం బలవంతం చేసే మిత్రులు రారు, ఉండరు. చెడు విడిచిపెట్టి మంచిని అలవర్చుకునే కాలం Lent. అలా అలవర్చుకుని పరలోక రాజ్యాన్ని స్వతంత్రించుకుందాం. అలాంటి ధన్యత యేసయ్య మనకందరికి దయచేయును గాక....ఆమెన్.***